# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ కేంద్ర మంత్రివర్గం రెండు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఈరోజు ఆమోదం తెలిపింది.

❖ నేపాల్‌లో కొనసాగుతున్న హింసాత్మకమైన నిరసనల కారణంగా భారత్-నేపాల్ సరిహద్దులో భద్రతను ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తోంది.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.

❖ భారత్ యూఏఈ జట్ల మధ్య జరుగుతున్న టీ-20 క్రికెట్ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మంత్రివర్గం రెండు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బీహార్‌లోని బక్సార్ - భాగల్‌పూర్ హైస్పీడ్ కారిడార్ పరిధిలోని మోకామా - ముంగేర్ 4 వరుసల రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. మొత్తం 4 వేల 447.38 కోట్ల రూపాయలతో 82.4 కిలోమీటర్ల మేర ఈ రహదారి ప్రాజెక్టుని చేపడుతున్నామని తెలిపారు. అదే విధంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని భాగల్పూర్ - దుమ్కా - రాంపూర్హాట్ సింగిల్ రైల్వే లైన్ సెక్షన్‌ను సుమారు 3 వేల 169 కోట్ల రూపాయల వ్యయంతో డబ్లింగ్ చేసేందుకు సైతం క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపిందని అశ్వినీ వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. భారత ప్రధానమంత్రి ముందుగా ఉత్తరప్రదేశ్ లోని వారణాసి చేరుకొని మారిషస్ ప్రధానమంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రాంగూలంతో జరిగే సమావేశానికి ఆతిథ్యమిస్తారు. ఆరోగ్యం, విద్య, విజ్ఞాన శాస్త్రం - సాంకేతికత, మౌలిక సదుపాయాలతో పాటు పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, సముద్ర ఆర్థిక వ్యవస్థల వంటి వర్ధమాన రంగాల్లోనూ సహకారాన్ని విస్తరించుకొనే అవకాశాలపై ఇరువురు చర్చించనున్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు పయనమవుతారు. సాయంత్రం విహంగ వీక్షణం ద్వారా ఉత్తరాఖండ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఆ తరువాత అధికారులతో జరిగే ఉన్నత స్థాయి సమీక్షలో ప్రధానమంత్రి పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ పొరుగు దేశమైన నేపాల్ లో వరుసగా మూడవ రోజు కూడా నిరసనలు కొనసాగాయి. ప్రస్తుతం జాతీయ భద్రత బాధ్యతను చేపట్టిన నేపాల్ సైన్యం రేపు ఉదయం 6 గంటల వరకు ఆ దేశవ్యాప్తంగా కర్ఫ్యూని పొడిగించింది. ఆందోళనకారుల నిరసనలు హింసారూపం దాల్చడంతో పాటూ ఆస్తి నష్టం, దోపిడీ, దాడులకు పాల్పడుతున్నందున ఈ చర్య అవసరమని సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. నేపాల్ సైన్యంతో సహా భద్రతా సిబ్బంది వీధుల్లో భారీగా మోహరించడంతో ఖాట్మండు లోయలో పరిస్థితి కొంచెం మెరుగుపడుతోంది. అత్యవసరమైతే తప్ప.. ఎవరూ తమ ఇళ్లను వదిలి బయటకు రావద్దని సైన్యం సూచించింది. దుండగులు వ్యక్తిగత ఆస్తులతో పాటూ ప్రజా ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటున్నారని చారిత్రక, సాంస్కృతిక మతపరమైన ప్రదేశాలపై ఎవరైనా దాడులకు పాల్పడితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని.. నేర కార్యకలాపాలను నియంత్రించడానికి భద్రతా సంస్థలతో సహకరించాలని నేపాల్ సైన్యం విజ్ఞప్తి చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్‌లో కొనసాగుతున్న అశాంతి, రాజకీయ సంక్షోభం కారణంగా ఉత్తరాఖండ్ సమీపంలోని భారత్ - నేపాల్ సరిహద్దులో భద్రతను ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తోంది. సరిహద్దు ప్రాంతాలలో SSB, స్థానిక పోలీసులు సంయుక్తంగా విస్తృతంగా తనిఖీలు, పెట్రోలింగ్, కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్ లోని నేపాల్‌తో సరిహద్దును పంచుకునే అన్ని జిల్లాల్లో కూడా ఆ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటలూ హై అలర్ట్ ప్రకటించింది. సరిహద్దు జిల్లాల్లో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అదనపు పోలీసు బలగాలను మోహరించింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్ లో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంతవరకూ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భారత పౌరులకు సూచించింది. నేపాల్‌లో ప్రస్తుతం ఉన్న భారతీయ పౌరులు అధికారులతో పాటు.. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం నుండి వెలువడే స్థానిక భద్రతా సలహాలను పాటించాలని సూచించింది. ఏదైనా సహాయం అవసరమైతే, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం హెల్ప్ లైన్ నంబర్స్ +977-980 860 2881, +977-981 032 6134 లను సంప్రదించాలని కోరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రకోటపై నుండి ప్రకటించిన భావితరం జీఎస్టీ సంస్కరణలకు ఇటీవల జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం లభించింది. అనే రంగాలలో ఈ సంస్కరణలు విశేషమైన ప్రభావాన్ని చూపనున్నాయి. అందులో విద్యా రంగాన్ని గమనించినట్లయితే స్టేషనరీ వస్తువులపై GST రేట్లను మినహాయించడం ద్వారా ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద ఉపశమనాన్ని ప్రకటించింది. పెన్సిళ్లు, షార్పెనర్లు, క్రేయాన్లు, వ్యాయామ పుస్తకాలు, గ్రాఫ్ పుస్తకాలు, మ్యాప్‌లు,

చార్ట్ లు వంటి స్టేషనరీ వస్తువులను మునుపటి 12 శాతం GST నుండి మినహాయించింది. ఈ మినహాయింపు విద్యా ఖర్చులను తగ్గించనుంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూర్చనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లో చార్ ధామ్ యాత్ర రెండవ దశ ఈరోజు ప్రారంభమయ్యింది. సెప్టెంబర్ 15 నుండి హెలికాప్టర్ సేవలు కూడా తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని, గంగోత్రి యమునోత్రి మార్గాల్లో రహదారి సంబంధిత సమస్యలు కొన్ని చోట్ల కొనసాగుతున్నాయని గర్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే 4-5 రోజుల్లో తూర్పు భారతదేశంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ఒడిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మరిన్ని వివరాలను IMD శాస్త్రవేత్త డాక్టర్ రఘు వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియాకప్ 2025లో భాగంగా భారత్, యూఏఈ జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్  దుబాయ్ లోని ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా కొద్ది సేపటి క్రితం ప్రారంభమైంది. తొలుత టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన యూఏఈ 6 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 42 పరుగులు చేసింది. ఈ టోర్నమెంట్ లో మొత్తం 8 జట్లు రెండు గ్రూపుల వారీగా పోటీ పడుతున్నాయి. రెండు గ్రూపులలో తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సూపర్4 కి అర్హత సాధిస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81 వేల 101 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 324 పాయింట్ల లాభంతో 81 వేల 425 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్ల లాభంతో 24 వేల 973 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88 రూపాయల 10 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3 వేల 654 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =